క్లుప్తంగా

నేడు గ్రామ దేవతలకు శ్రావణ పట్టీ

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ ఆలయం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కొలువై ఉన్న గ్రామదేవతలకు శుక్రవారం శ్రావణ పట్టీ (చీర, పసుపు, కుంకుమ, పూలదండలు) ఇస్తామని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం తెలిపారు. తొలుత శుక్రవారం దేవతలకు అలంకరణ ఆనవాయితీగా ఉన్న పెనుగంచిప్రోలులో తూర్పు బజారు. యాదవ బజారు, కొల్లికూళ్లలో ముత్యాలమ్మకు, కొణకంచిలో అంకమ్మ, ముత్యాలమ్మ, రాట్నాలమ్మ, లింగగూడెం, ముచ్చింతాల, శనగపాడు, వెంకటాపురం, వెంగనాయకునిపాలెంలో ముత్యాలమ్మవారికి శ్రావణ పట్టీ ఇస్తామని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయం నుంచి ప్రచార రథం ద్వారా ఊరేగింపుగా ఆయా గ్రామాలకు శ్రావణ పట్టీ తీసుకెళ్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పెనుగంచిప్రోలు మండలం తరువాత జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

నిత్యాన్నదానానికి రూ.20,116 విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గురువారం జగ్గయ్యపేట పట్టణానికి చెందిన పాడుగు శివరామకృష్ణ కుటుంబసభ్యులు రూ.20,116 విరాళాన్ని సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ ధర్మకర్త కోలా రామారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

తిరుపతమ్మ సేవలో అరుణాచలం స్వామీజీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మను తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం రుద్రాక్షస్వామి తన శిష్యబృందంతో కలిసి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరుణాచలం వచ్చే భక్తులకు వసతి, భోజన సదుపాయం కల్పించేందుకు భవన నిర్మాణం కోసం ధర్మ ప్రచారంలో భాగంగా అమ్మవారిని దర్శించుకున్నామని తెలిపారు. వామకుంట్ల పీఠాధిపతి రామడుగు నరసింహాచార్యులు, కల్లూరి శ్రీ వాణి, సమసరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు తిరుపతమ్మకు వజ్రకిరీటం అలంకరణ



పెనుగంచిప్రోలు: భక్తుల కోరిక మేరకు గ్రామంలో వేంచేసిన శ్రీతిరుపతమ్మకు శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వజ్ర కిరీటాన్ని అలంకరిస్తామని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం తెలిపారు. నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ ఎనిమిదో తేదీన కూడా ఈ కిరీటాన్ని అలంకరిస్తామని పేర్కొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

పెనుగంచిప్రోలు: బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఘటన మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో గురువారం జరిగింది. వత్సవాయికి చెందిన వ్యక్తితో పెనుగంచిప్రోలుకు చెందిన బాలికతో పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఐసీడీఎస్, పోలీస్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో అధికారులు స్పందించి ఘటనా స్థలానికి వెళ్లి బాలికకు వివాహం చేస్తున్న పెళ్లి పెద్దలను మందలించారు. బాలిక తల్లిదండ్రులను బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

విద్యుత్ మోటార్లకు మరమ్మతులు

గండేపల్లి(కంచికచర్ల): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రక్షిత మంచినీటి పథకం విద్యుత్ మోటార్లకు సర్పంచి బొక్కా రవికుమార్ గురువారం మరమ్మతులు చేయించారు. కీసర మున్నేటి ఒడ్డున ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం విద్యుత్ మోటార్ల వైర్లన్నీ పూర్తిగా కాలిపోయాయని రవికుమార్ తెలిపారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.50 వేలు వెచ్చించి విద్యుత్ మోటార్లకు మరమ్మతు చేయించామన్నారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కంచికచెర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన అంగజాల సత్యనారాయణ (36) ఐదేళ్ల క్రితం భార్యాపిల్లలతో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడుకు వలస వచ్చాడు. సత్యనారాయణ పొగాకు కంపెనీలో, అతని భార్య ఐటీసీలో పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. రెండు నెలల కిందట సత్యనారాయణ సోదరి నాగమణి గుండెపోటుతో మృతి చెందింది. దీంతో సత్యనారాయణ కొద్దిరోజులుగా పనులకు వెళ్లకుండా బాధపడుతున్నాడు. ఈ నెల 14న అర్ధరాత్రి గుళికలు తిన్నాడు కుటుంబ సభ్యులు సత్యనారాయణను చికిత్స నిమిత్తం స్థానిక కాటూరి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. మృతుని తల్లి అంగజాల పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు తెలిపారు.

జయహో చంద్రయాన్



నందిగామలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



జగ్గయ్యపేటలో జెడ్పీ విద్యార్థుల ర్యాలీలో సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల వ్యాప్తంగా పలు పాఠశాలల విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. జగ్గయ్యపేట మండలం, గండ్రాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత దేశ కీర్తి ప్రపంచానికి చాటిందన్నారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేబూని జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సత్యనారయణ, చలపతిరావు, సంధ్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన భారత్

వత్సవాయి: అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ చరిత్ర సృష్టించిందని పలువురు పేర్కొన్నారు. చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా మండలంలోని మక్కపేట గ్రామంలోని శ్రీ సాయి సెంచరీ హైస్కూల్, శారద విద్యానికేతన్ పాఠశాలల్లో గురువారం సంబరాలు చేసుకున్నారు. సాయి సెంచరీలో ఇస్రోకు, శారద విద్యానికేతన్‌లో చంద్రయాన్–3కు అక్షరరూపం ఇచ్చారు. ప్రైవేటు పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు కె.ఆర్.సవితాభరద్వాజ్ మాట్లాడుతూ..



గండ్రాయిలో విద్యార్థుల ర్యాలీ

చంద్రయాన్–3 ద్వారా చంద్రుడి మీద విక్రమ్ ల్యాండర్ సేఫ్ ల్యాండింగ్ కావటం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. ఇంతటి చరిత్రకు కారణమైన కారకులైన ఇస్రోశాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో భారత్ మరిన్ని ప్రయోగాలు చేయాలని ఆకాంక్షించారు. సాయిసెంచరీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సవిత, శారద విద్యానికేతన్ కరస్పాండెంట్ బి.రామారావు పాల్గొన్నారు.

జయహో భారత్

నందిగామ: చంద్రయాన్–3 విజయవంతమైన నేపథ్యంలో జయహో భారత్ పేరుతో నందిగామ పట్టణంలో గురువారం సాయంత్రం విద్యార్థు భారీ జాతీయ జెండాతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. శ్రీ చైతన్య విద్యార్థులు ప్రిన్సిపాల్ గుత్తా ప్రదీప్ ఆధ్వర్యంలో 500 మీటర్ల జాతీయ జెండాతో పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో ర్యాలీ కొనసాగించారు. మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక సంబరాలు జరిగాయి.

విద్యార్థుల విజయోత్సవ ర్యాలీలు

జగ్గయ్యపేట అర్బన్: చంద్రయాన్–3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియ విజయవంతమైన సందర్భంగా గురువారం పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇస్రో అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్ కొలగాని రాము, తదితర ముఖ్య నాయకులు, స్కూల్ హెచ్‌ఎం మాధవీలత పాల్గొన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల విద్యార్థులు జై భారత్, చంద్రయాన్–3 అక్షరాకృతిలో కూర్చుని కోట్లాది మంది భారతీయులు సగర్వంగా తలెత్తుకునేలా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు తమ శుభాకాంక్షలు తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి పాల్గొన్నారు. శ్రీచైతన్య పాఠశాల స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా జయహో భారత్ పేరుతో చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం.లావణ్య, పట్టణ ఎస్‌ఐ రామారావు, స్కూల్ ఏజీఎం మురళి, ఆర్‌ఐ వినోద్, డీన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో జై భారత్, చంద్రయాన్–3 అక్షరాకృతిలో విజ్ఞాన్ విద్యార్థులు



ఇస్రో అక్షరరూపంలో మక్కపేట శ్రీ సాయి సెంచరీ స్కూల్ విద్యార్థులు

పరిపాలనా సౌలభ్యం.. ప్రజల ఆకాంక్ష మేరకే

- మండల కేంద్రం మార్పుపై సమావేశంలో ఎమ్మెల్సీ అరుణకుమార్
- నేడు జుజ్జూరుకు మండల కార్యాలయాల తరలింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జుజ్జూరు(వీరులపాడు): పరిపాలనా సౌలభ్యం.. ప్రజల ఆకాంక్ష మేరకే మండల కేంద్రాన్ని మారుస్తున్నామే తప్ప ఎటువంటి స్వార్థ ప్రయోజనాలు లేవని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. వీరులపాడు నుంచి జుజ్జూరుకు మండల కేంద్రాన్ని మారుస్తున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, గ్రామస్తులతో జుజ్జూరులో గురువారం రాత్రి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చేపట్టిన పాదయాత్రలో మెజార్టీ గ్రామాల ప్రజలు వీరులపాడు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని, జుజ్జూరుకు మండల కేంద్రాన్ని మార్చాలని విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. ఈ విజ్ఞాపనలను పరిశీలించి మండల కేంద్ర మార్పుకు కృషి చేస్తామని హామీ ఇచ్చామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు.

స్వార్థానికి తావుండదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజా సౌకర్యానికి తప్ప స్వార్థ ప్రయోజాలకు తావుండదని అరుణకుమార్ అన్నారు. మండల కేంద్రం మార్పుతోపాటు కేంద్రీయ విద్యాలయం, 100 పడకల ఆస్పత్రి, నందిగామ పట్టణ ఆధునికీకరణ, చందర్లపాడు–కంచికచర్ల మండలాలను అనుసంధానం చేసేలా కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయం, 100 పడకల ఆస్పత్రి, మండల కేంద్రం మార్పు మంజూరు చేశారని వివరించారు. మండల కేంద్రంగా మారినందున నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా జుజ్జూరులో ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం అధికారులంతా మండల కేంద్రమైన జుజ్జూరుకు వస్తున్నారని గ్రామస్తులు, పార్టీలకతీతంగా నాయకులు, ప్రతి ఒక్కరు ఘన స్వాగతం పలకాలని కోరారు.

నేడు జుజ్జూరుకు కలెక్టర్ రాక

మండల కేంద్రం మార్పులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు జుజ్జూరుకు వస్తున్న సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం గ్రామానికి వస్తారని ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, హైదరాబాద్ ఎయిర్ పోర్టు ఏజీఎం మేడికొండూరు నందకుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పూలా రాంబాబు, మేడి కొండూరు రవికుమార్, జిల్లేపల్లి స్వామి, నాగుల్‌మీరా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉత్తమ లైబ్రేరియన్ అల్లూరుకు సత్కారం



రామచంద్రుడిని సత్కరిస్తున్న పాఠకులు, బీడీసీ నిర్వాహకులు

కంచికచర్ల: ఉత్తమ లైబ్రేరియన్ అల్లూరు రామచంద్రుడిని స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం పాఠకులు, బీడీసీ (బుక్ డిపాజిట్ సెంటర్)లు సత్కరించారు. ఈ నెల 15న విజయవాడలో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా రామచంద్రుడు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందుకున్నారు. బీడీసీ నిర్వాహకులు, పాఠకులు, మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు రామచంద్రుడిని పూలమాలలు, శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మోగులూరు, మున్నలూరు, పరిటాల, నక్కలంపేట, జుజ్జూరు, నరసింహారావుపాలెం, అల్లూరు బీడీసీలు పేరయ్య, శ్రీనివాసరావు, నాగరాణి, అంజిలి, వరలక్ష్మి, లక్ష్మి, ఏలేశ్వరమ్మ, బాలకోటయ్య పాల్గొన్నారు.

రేపు న్యాయ సేవా శిబిరం



న్యాయమూర్తి శ్రీనివాసరావు

నందిగామ: నూతన తరహా న్యాయ సేవా శిబిరాన్ని విజయవంతం చేయాలని పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నందిగామ నెహ్రూనగర్‌లో ఉన్న కమ్మ కల్యాణ మండప ఆవరణలో ఈ నెల 26వ తేదీన నూతన తరహా న్యాయ సేవా శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో న్యాయ సేవలు అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పరిపాలన యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఏవైనా ఫిర్యాదులు చెయ్యాలనుకునే వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

ఆడుదాం.. ఆంధ్రకు క్రీడా మైదానాల ఎంపిక

జగ్గయ్యపేట: మండలంలో అక్టోబర్ రెండు నుంచి నవంబర్ ఎనిమిదో తేదీ వరకు జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కోసం పలు క్రీడా మైదానాలను ఎంపిక చేశామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ.. ప్రజలకు క్రీడలపై అవగాహన పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సచివాలయ నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం, బూదవాడ సచివాలయాలకు బలుసుపాడులోని బాలుర పాఠశాల, చిల్లకల్లు–1,2, ధర్మవరప్పాడు తండా, జయంతిపురం, వేదాద్రి సచివాలయాలకు చిల్లకల్లు ఆల్ సెయింట్స్ పాఠశాల, గండ్రాయి–1,2, మల్కాపురం సచివాలయాలకు మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముక్త్యాల, కె.అగ్రహారం సచివాలయాలకు జగ్గయ్యపేట పట్టణంలోని బాలుర పాఠశాల, గౌరవరం, బండిపాలెం, పోచంపల్లి సచివాలయాలకు గౌరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, షేర్‌మహ్మద్‌పేట–1,2. తక్కెళ్లపాడు, అనుమంచిపల్లి సచివాలయాలకు షేర్‌మహ్మద్‌పేట జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానాలను ఎంపిక చేశామని వివరించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ధ్రువపత్రాల జారీలో అలసత్వం వద్దు

జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: వీఆర్‌వోల పరిధిలో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో మంజూరు చేయాలని మునిసిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు సూచించారు. ఈ ధ్రువపత్రాల జారీలో అలసత్వం వద్దని హితవుపలికారు. స్థానిక 1, 13, 14వ సచివాలయాల్లో మునిసిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆయా సచివాలయాల రికార్డులను పరిశీలించారు. అమ్మ ఒడి, చేయూత మొదలగు పథకాల ఈకేవైసీలను పరిశీలించారు. బీఎల్‌ఓలు పూర్తి చేసిన సర్వే ఓటర్ల జాబితా ఫారాలను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీ లోగా పూర్తి చేసిన సర్వే వివరాలను ఆన్‌లైన్ చేయించాల్సిందిగా బీఎల్‌ఓలను ఆదేశించారు.

జస్టిస్ శేషసాయిని కలిసిన నందిగామ న్యాయవాదులు



జస్టిస్ శేషసాయిని సత్కరిస్తున్న న్యాయవాదులు

నందిగామ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి కృష్ణాజిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ ఎ.వి.శేషసాయిని నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కలిశారు. న్యాయస్థానంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన న్యాయవాదులు జస్టిస్ శేషసాయిని సత్కరించారు. నందిగామలో కోర్టు భవనాల నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టును నూతన భవన సముదాయంలోకి మార్చాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బండి మల్లికార్జునరావు, పి.ప్రకాష్, ఏపీపీ ఈశ్వర ప్రగడ రంగారావు, న్యాయవాదులు మన్యం నారాయణరావు, కొనకంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తులను స్మరించుకుందాం

రాష్ట్ర యువజన సర్వీసులశాఖ కమిషనర్ శారదాదేవి



మొక్క నాటుతున్న శారదాదేవి, సునీత, బాలశంకరరావు

కంచికచర్ల: దేశ ప్రజలకు బానిస సంకెళ్ల నుంచి విముక్తి ప్రసాదించిన త్యాగమూర్తులను స్మరించుకుందామని, వారి రుణం తీర్చుకుందామని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి అన్నారు. కంచికచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నా భూమి – నా దేశం – వీరులకు వందనం ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేసి, కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా శారదాదేవి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర కోసం పోరాడిన మహనీయుల బాటలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. అనంతరం అనంతరం మొక్కలు నాటారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, తహసీల్దార్ పి.శంకరబాబు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, టీటీ షేక్ నాగుల్‌మీరా, ఎంఈఓ బి.బాలాజీ, ఏపీఓ రమాదేవి, ఏపీఎం కోట భాస్కరరావు, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీఎస్ రావు గొప్ప శాస్త్రవేత్త

- అమెరికాలో మృతి చెందిన సీఎస్ రావు
- సంతాపం తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



సీఎస్ రావు మృతికి సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: మనం ఏ స్థాయిలో ఉన్నామన్నది కాదని ఏ స్థాయికి చేరుకున్నామనే దానికి నిదర్శనం శాస్త్రవేత్త సి.ఎస్.రావు అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక కేవీఆర్ కళాశాలలో చంద్రయాన్–3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగటాన్ని హర్షిస్తూ ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి కేక్ కట్ చేసి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. నందిగామ ప్రాంతంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి తన తుది శ్వాస వరకు ప్రొఫెసర్‌గా సేవలందించి అమెరికాలో బుధవారం మృతి చెందిన శాస్త్రవేత్త సి.ఎస్.రావు మృతికి మౌనం పాటించి సంతాపం తెలిపారు. సి.ఎస్.రావు 39 దేశాల నుంచి గొప్ప శాస్త్రవేత్తగా అవార్డులు, సత్కారాలు పొందారని జగన్‌మోహనరావు కొనియాడారు. మిస్సైల్ మ్యాన్‌గా పేరుపొందిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం సైతం సి.ఎస్.రావును గ్రేటెస్ట్ సైంటిస్ట్‌గా అభివర్ణించారని గుర్తుచేశారు. 102 ఏళ్ల వయసులో మృతి చెందిన ఆయన 98 ఏళ్ల వయసు వరకు ప్రొఫెసర్‌గా సేవలు అందించారని పేర్కొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



విద్యుత్ దీపాలంకరణలో వాసవిమాత ఆలయం

నందిగామ: శ్రావణ మాసంలో రెండో శుక్రవారానికి ఎంతో ప్రత్యేకత ఉంది. మహిళలు వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి. రెండో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నందిగామలోని పలు అమ్మవారి ఆలయాలను గురువారమే రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మరిడి మహాలక్ష్మి, వాసవి కన్యకా పరమేశ్వరి, దుర్గానగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాలు రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ఈ ఆలయాలలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు జరగనున్నాయి.

పూల ధరలకు రెక్కలు:

శ్రావణమాసం రెండో శుక్రవారం నేపథ్యంలో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. మూర మల్లెపూలు రూ.120 చొప్పున, మూడు చామంతులను రూ.10, ఒక్కో గులాబీని రూ.5 చొప్పున విక్రయించారు. తమలపాకుల కట్ట ధర రూ.170 పలికింది.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న వెంకటకృష్ణ ప్రసాద్, రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని 20,22వ వార్డుల్లో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటకృష్ణ ప్రసాద్, రాఘవేంద్ర గడప గడపకూ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ నాయకులు ఆకుల శ్రీకాంత్, మునిని రాజ్యలక్ష్మి పెంటి శ్రీనివాసరావు, బద్దూనాయక్, చాపల వెంకటేశ్వర్లు, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరి దేవి అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకుడు మూర్తి సాంబశివశాస్త్రి పర్యవేక్షణలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులు కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య, కమిటీ సభ్యులు నాగేంద్రం, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, చేడే శ్రీరంగం, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.